క్లుప్తంగా

ఆవులను గోశాలకు తరలించాలి



ఐనవోలు : మండల కేంద్రం సమీపంలో గోవధ కోసం అక్రమంగా నిర్బంధించిన 37 గోవులను తక్షణమే గోశాలకు తరలించాలని విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు కోరారు. ఐనవోలుకు చెందిన విశ్వహిందు పరిషత్ నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా విశ్వహిందు పరిషత్ ప్రతినిధి ఉదయ్ శ్రీరామ్ అక్కడకు చేరుకుని 37 ఆవులను పరిశీలించారు. స్థానిక ఎస్సై, మామునూరు ఏసీపీకి వీహెచ్‌పీ నాయకులు సమాచారం అందించి ఆవులను నిర్బంధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిరికొండ పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ వల్పదాసి చంద్రమౌళి, పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన సాంబమూర్తి అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రాజేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పల్లెబోయిన సారయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

దామెరలో..



దామెర : మండల కేంద్రానికి చెందిన దుస్స మొగిలి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం మొగిలి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. సీనియర్ నాయకులు బిల్లా రమణారెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, దామెర రవి, దామెర రతన్ ఉన్నారు.

ఎల్లయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగం పరిశోధకుడు, ఖిలా వరంగల్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మధుపాక ఎల్లయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గౌతమ బుద్ధాస్ టీచింగ్స్ అండ్ ఇట్స్ రెలవెన్స్ టూది కాంటెంపరరీ ఇండియన్ సొసైటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఎల్లయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రామానుజరావు పర్యవేక్షణలో ఎల్లయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: ఆగస్టు 26, 27, 28వ తేదీల్లో వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్‌బంక్ జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరంలో శివలింగం, వినాయక, నందీశ్వర, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్ తెలిపారు. ఈమేరకు నల్లకుంట రవికుమార్, దేవేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనను ఆగస్టులో శాస్త్రీయంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. విగ్రహాల దాతలు సిద్దం రాము, కార్పొరేటర్ ఉమ, గజ్జెల శ్యామ్, నల్లకుంట రవికుమార్, డాక్టర్ రమేష్, కమ్మ రామ్మోహన్‌రావు విరాళంగా రూ.25 వేల చొప్పున ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

బిర్యాని విక్రయ కేంద్రాలపై బాధితుల ఫిర్యాదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో నాసిరకం నూనెలు, కుళ్లిన మాంసంతో తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న బిర్యాని పాయింట్లపై ఆకస్మిక దాడులు చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పట్టణంలో లెక్కకు మించిన బిర్యాని సెంటర్లను ఏర్పాటు చేసి ధర తక్కువ పేరుతో ఆకర్షిస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాజీపేట చౌరస్తాకు సమీపంలో బిర్యాని తిన్న 8మందికి వాంతులు, విరోచనలు అయిన విషయాన్ని గుర్తుచేశారు. రాత్రి మిగిలిన బిర్యానిని దాచిపెట్టి ఉదయం వేడి చేసి విక్రయిస్తున్న వ్యాపారుల ఆట కట్టించాలని బాధితులు కోరారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

మలుపులతో పొంచిఉన్న ప్రమాదం

- ఏపుగా పెరిగిన ముళ్లపొదలు
- పట్టింపులేని అధికారులు



రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు



ప్రమాదకరంగా మలుపు

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారం వరకు రోడ్డు మలుపులతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో కొత్తగట్టు సింగారం చేరుకోవచ్చు. ఈ రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని అంటున్నారు. ఎస్సారెస్పీ కెనాల్ అవతల వైపు జేసీబీతో రోడ్డుకిరువైపులా పెరిగిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల కొమ్మలను తొలగించి రోడ్డుపైన వేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడుతున్నారు. ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకిరువైపుల పెరిగిన ముళ్ల పొదలను, రోడ్డుపై వేసిన చెట్టుకొమ్మలను తొలగించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి

ముళ్ల పొదలు, మలుపుల రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలి.

– అనుకారి శివాజీ, శాయంపేట

ఊరుగొండలో డీజిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన ట్యాంకర్

దామెర : డీజిల్ ట్యాంకర్ బోల్తా పడడంతో డీజిల్ నేలపాలయ్యింది. ఈ సంఘటన మండలంలోని ఊరుగొండ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. (టీఎస్12 యూసీ 6019) నంబర్ గల ట్యాంకర్ డీజిల్‌తో హనుమకొండ నుంచి గూడెప్పాడ్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో ఊరుగొండ వద్దకు రాగానే జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. దీంతో అందులోని డీజిల్ రోడ్డుపై ప్రవహించింది. కాగా ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత

వేలేరు : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పీచర గ్రామానికి చెందిన మక్కల కొమురయ్యకు సీఎం సహాయ నిధి ద్వారా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎల్‌ఓసీ మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ సరిత తెలిపారు. ఈ మేరకు ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి ఆదివారం అందించినట్లు తెలిపారు. కో ఆప్షన్ సభ్యుడు జానీ, మాజీ సర్పంచ్‌లు వీరయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఎల్కతుర్తి : పూర్వవిద్యార్థులు దిగిన గ్రూప్ ఫొటో



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో..



శాయంపేటలో..



పరకాలలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు గ్రామంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని శ్రీకృష్ణ దేవరాయ పాఠశాలలో 1994–95 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులంతా కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. పాఠశాలలో చదివి విదేశాల్లో స్థిరపడడం గర్వంగా ఉందని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను కొనియాడారు. అనంతరం విద్యార్థులంతా సంపక్తి భోజనం చేసిన అనంతరం ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేసి గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గోపు భగవాన్‌రెడ్డి, కుమారస్వామి, గూగులోత్ శ్రీనివాస్, రమేశ్, సారబుడ్ల శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచందర్, జగన్, హరిమూర్తి, శ్యాంసుందర్, మహేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీను, విజయ, శశికళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2005–06 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సవాసి రాజు, అయిత మహేశ్, బూర్ల శ్రావణ్, సర్జన, అనిల్, పైడిపెల్లి పృథ్వీరాజ్, శ్రీనివాస్, సుజాత, హసీనా, ప్రవళిక, లావణ్య, చందన, చైతన్య, కవిత, అనూష, సునీత పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–1989లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నేమరు వేసుకొని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రమాదేవి, శ్రీలత, మంజుల, వేదవతి, శైలజ, రాజేందర్, ప్రభాకర్, సంతోశ్, రమేశ్, యాదగిరి, సాంబయ్య, పెద్ద రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామచంద్రరావు, శోభన్‌బాబు, కిరణ్, రవి పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో 26 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒక్కచోట కలుసుకోవడంతో పట్టణంలోని సీఎస్‌ఐ ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. 1997–1998 విద్యా సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు 26 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం (గెట్ టూ గెదర్) నిర్వహించారు. పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వాహకులు శనిగరపు నవీన్, ఒంటేరు మధు, చొల్లేటి సునేందర్, బొల్లారం సదయ్య, మడికొండ సునీల్, పట్టెం శంకర్, ముత్యాల శ్రీనివాస్, అడప రాజేందర్, డాక్టర్ ఇమ్రాన్, మల్లికార్జున్, ఒంటేరు రాము, రవికుమార్, రమేశ్, చిరంజీవి, సునీత, సుప్రియా, సుజాత, శ్రీలత, పూలదేవి, సుహాసిని, సంధ్య, కవిత, లక్ష్మీ, సునంద, లావణ్య, వనిత పాల్గొన్నారు. కాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలతో వివిధ పాఠశాలల్లో పండుగ వేడుక నెలకొంది.

భారీ వాహనాలతో ఇబ్బంది పడుతున్నాం



వినయ్‌భాస్కర్‌కు తమ సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ / కాజీపేట: భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాజీపేట ప్రాంతానికి చెందిన బృందావన్ కాలనీతో పాటు పక్క కాలనీవాసులు వాపోయారు. ఈమేరకు హనుమకొండ వడ్డెపల్లిలోని స్వగృహంలో మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆదివారం కలిసి తమ సమస్యను వివరించారు. గతంలో పలు పరిశ్రమలకు చెందిన వాహనాల రాకపోకలు నిలిచిపోగా, గత కొద్ది రోజులుగా భారీ వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయని, దాంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఏకరువు పెట్టారు. గ్రానైట్ ఇండస్ట్రీకి సంబంధించిన లారీలు నిత్యం పెద్ద బండరాళ్లతో కాలనీల ద్వారా వెళ్తూ స్థానిక రహదారులను ధ్వంసం చేస్తున్నాయని, 24 గంటలు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోయారు. భారీ, అతి భారీ వాహనాలతో దుమ్మూ ధూళి తమ ఇళ్లపై చేరుతోందని, దాంతో పలు ఇళ్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇదే సమస్యను పరిష్కరించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కాలనీవాసుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్, రాజయ్య, సోని, భద్రయ్య, సరోజన, ఉమా, బుచ్చిరెడ్డి, వీరమల్లు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత



శ్రీలక్ష్మి (ఫైల్)

హన్మకొండ కల్చరల్: హసన్‌పర్తికి చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ తిరుకోవళూరు శ్రీరంగస్వామి సతీమణి శ్రీలక్ష్మి గత శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈమేరకు వైద్య పరిశోధనల కోసం శ్రీరంగస్వామి తన సతీమణి పార్థివదేహాన్ని వరంగల్ కేఎంసీ అనాటమీ విభాగానికి ఆదివారం అప్పగించారు. కార్యక్రమంలో శ్రీరంగస్వామి కుమారుడు ఉషాకాంత్, కూతురు సంధ్య, శ్రీధరస్వామి, కవులు నిధి బ్రహ్మచారి, విజయ, విక్రాంతాచార్యులు బన్న అయిలయ్య, వెంకటకృష్ణ, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే

హసన్‌పర్తి: ఫాదర్స్ డే వేడుకలను హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తన ఇంటిలో ఆదివారం రాత్రి ఫాదర్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ కేక్‌కట్ చేశారు.

అవార్డు గ్రహీతకు వాకర్స్ సన్మానం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రజాసేవ అవార్డును హైదరాబాద్‌లో గవర్నర్ నుంచి కేయూ వాకర్స్ అసోసియేషన్ బాధ్యుడు దేశిని లక్ష్మీనారాయణ అందుకున్నారు. ఈమేరకు క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో కేయూ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బాధ్యులు మహేందర్ రావు, రతన్‌సింగ్, ప్రొఫెసర్ సంజీవరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వెంకయ్య, డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ హరిప్రసాద్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సోమిడిలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు



ఎల్లమ్మతల్లి దేవతామూర్తులు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని రేణుకాఎల్లమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు బోనాలతో డప్పు, వాయిద్యాలతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ అర్చకుడు శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ఆవరణలో చల్లని పందిళ్లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

కౌశిక్‌రెడ్డి..నోరు అదుపులో పెట్టుకో

- కాంగ్రెస్ నాయకుల ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కమలాపూర్ : 'ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి కళ్లు మండుతున్నాయా. నిరాధరణ ఆరోపణలు చేస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు' అని కాంగ్రెస్ పార్టీ మాజీ బీసీసెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్, కరీంనగర్ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, బీసీసెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నేత, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచిత, అసత్య, నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన చరిత్ర కౌశిక్‌రెడ్డిదని, తెలంగాణ ద్రోహి, గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్‌మెయిల్ చేసి గెలిచిన కౌశిక్‌రెడ్డి.. ప్రజల ఆదరణతో గెలిచిన మంత్రి ప్రభాకర్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనేక స్కాంలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న కౌశిక్‌రెడ్డి.. మంత్రి పొన్నం ప్రభాకర్ బూడిద స్కాం చేస్తున్నాడని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు డాక్టర్ రాజన్న, జగన్, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, ఐలయ్యగౌడ్, రమేశ్, భిక్షపతి, వంశీధర్ రావు, శివకృష్ణగౌడ్, పర్శరాములుగౌడ్, శ్రీధర్‌గౌడ్, రాములు, సురేష్, ప్రభాకర్, ఇంద్రసేన, శంకరయ్య, రోహిత్, నరేష్, శ్రీను పాల్గొన్నారు.

యువత మత్తుమాయలో పడొద్దు

- ఎస్సై వెంకటేశ్వర్లు



వంగరలో కిరాణా షాపులను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఎల్కతుర్తి : నిషేధిత గంజాయి, గుట్కా, పొగాకు వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తుమాయలో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, గుట్కా, పొగాకు వంటి పత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వ హెచ్చరికలను ఉల్లంగిస్తే పీడీయాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారి కదలికలు, ప్రవర్తన, నడవడికను గమనించాలని సూచించారు. వ్యసనాలకు అలువాటు పడిన యువత, విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి సన్మార్గంలో నడిపించే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ పురస్కారాల అందజేత



ఐనవోలు : సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



రమేశ్‌కు అవార్డు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఐనవోలు : ఎండోమెంట్ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్‌రావుకు తెలంగాణ సంస్కృతి సాహితి జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు తెలంగాణ సంస్కృతి సాహితి సేవా ట్రస్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్, హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాగరాజు పురస్కారం అందించారు. ఆధ్యాత్మిక సేవా రంగంలో సేవ అందిస్తున్న నాగేశ్వర్‌రావు దంపతులకు స్వర్ణనంది ప్రధానోత్సవంతో పాటు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచవరం గౌరిశంకర్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ తనకు పురస్కారం అందించడం గర్వంగా ఉందన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన కూనపులి పటం కథ కళాకారుడు పురాణం రమేశ్ తెలంగాణ సంస్కృతి సాహితీ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ఆఫ్ రికార్డ్స్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. హనుమకొండ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం తెలుగు సంస్కృతి సాహితీ బుక్ఆఫ్ రికార్డ్స్ జాతీయ పురస్కారాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూనపులి పటంకథ కళారంగంలో అందిస్తున్న ఏకైక కళాకారుడు రమేశ్ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్, మానేపల్లి నరసింహాచారి, వేము సాహితీ సంస్థ ట్రస్ట్ చైర్మన్ వేము వందనం, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ట్రస్ట్ చైర్మన్ గర్రెపల్లి నవీన్‌కుమార్, రేవనపల్లి బుగ్గ రాములు, మాచవరం నరసింహ, సాయి శ్రీనివాస్, దీపక్, సాయి, ప్రదీప్ చేతుల మీదుగా ఆయన జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు.

బక్రీద్ పర్వదినం.. త్యాగానికి ప్రతీక

- నేడు ఈద్ – ఉల్ – జుహా వేడుకలు
- ఈద్గాల్లో ప్రత్యేక నమాజ్



ఈద్గా ప్రాంగణం

హసన్‌పర్తి/ ఖిలా వరంగల్/ హన్మకొండ కల్చరల్: బక్రీద్.. త్యాగానికి ప్రతీక. దైవాజ్ఞ మేరకు తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి భక్తికి ప్రసన్నుడైన దైవం అతడి (కుమారుడి) స్థానంలో ఒక దుంప(మేక పోతు) ప్రత్యక్షమవుతుంది. ఆ రోజు జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)వేడుకలు జరుపుకుంటున్నారు. పూర్వీకుల కథనం ప్రకారం.. మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి(అల్లా) ప్రియమైన భక్తుడు. మహ్మద్ ఇబ్రహీం భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం కలలోకి వచ్చి నీ కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఇబ్రహీం వెనుకాడకుండా, ఆలోచించకుండా భార్య, కుమారులను తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.. అయితే మార్గ మధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.... ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె నోరు మెదపదూ. ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ.. నీవు చేయబోతున్న పని మంచిది కాదు... కలలో వచ్చి కొడుకును బలి ఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుందని పొరపాటని ఇబ్రహీంను సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు సాగించాడు. అయినా ఇబ్రహీం ఆయన మాటలను లెక్కచేయకుండా దైవకార్యంలో లీనమై ముందుకు సాగాడు. నిర్జీవ ప్రదేశానికి వెళ్లిన తర్వాత గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని దైవమార్గంలో బలి ఇవ్వమని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(పొట్టేలు) ప్రత్యక్ష మైనట్లు ఖురాన్ గ్రంథంలో పేర్కొని ఉంది. ఇందుకు స్మరిస్తూ ఏటా బక్రీద్ వేడుకలు పురస్కరించుకుని ఖుర్బానీ ఇవ్వడం తప్పని సరిగా మారింది. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు హజ్ యాత్ర సాగిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 గంటలలోపే ప్రత్యేక నమాజ్ పూర్తవుతోంది.